క్లుప్తంగా

కుమారస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు జరిపించారు. స్వామి వారికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం, స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్య స్వామి వారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేకం చేపట్టారు.

బసవన్న, వీరభద్రుడికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోని స్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని శనగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరుడికి, శ్రీశైల క్షేత్ర పాలకునిగా ప్రసిద్ధిగాంచిన బయలువీరభద్ర స్వామి వారికి మంగళవారం సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు శాస్త్రోక్తంగా విశేష పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రదోషకాల సమయంలో పంచామృతాలతో అభిషేకాది అర్చనలు జరిపించారు. ఆరంభ పూజల్లో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పం పఠించారు. అనంతరం కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజ చేశారు. తదనంతరం నందీశ్వర స్వామికి నూతన వస్త్ర సమర్పణ విశేషార్చనలు చేపట్టి నానబెట్టిన శనగలను, క్షేత్రపాలకునికి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించారు.

ఉల్లాస్ పథకంపై అవగాహన

బండి ఆత్మకూరు : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఉల్లాస్ పథకం గురించి ఎంపీడీఓ ఎం.దస్తగిరి ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్య అవకాశాలు, వనరులు అందించడమే పథకం ముఖ్య ఉద్దేశ మన్నారు. అధికారులందరూ గ్రామాల్లో సర్వే నిర్వహించి నిరక్షరాస్య యువతీ యువకులను గుర్తించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని తెలిపారు. కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల



లింకు చానల్ ద్వారా వీబీఆర్‌లోకి ప్రవహిస్తున్న కృష్ణా జలాలు

వెలుగోడు: బానుకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి లింకు చానల్ ద్వారా వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ లోకి 13,200 క్యూసెక్కుల కృష్ణా జలాలు వచ్చి చేరుతున్నట్లు గంగ ఏఈ శివనాయక్ తెలిపారు. తెలుగుగంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి గాలేరు నదికి 9వేల క్యూసెక్కులు, మద్రాస్ కాలువకు 5వేల క్యూసెక్కులు, వన్ ఆర్ తూముకు 55 క్యూసెక్కులు, వన్ ఎల్ తూముకు 30 క్యూసెక్కులు, నంద్యాల తాగునీటికి 10 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు. రిజర్వాయర్‌లో మంగళవారం నాటికి 15.956 టీఎంసీల నీరు నిల్వ ఉందని వివరించారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించండి



విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న ఏఐటీయూసీ కార్యకర్తలు

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంటలో కొన్ని నెలలుగా విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం చోటు చేసుకుంటుండటంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.రూ.3.15 కోట్లతో నూతన 33–11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించి, సిబ్బందిని నియమించినా సమస్యలు తలెత్తుతుండంతో ప్రజలు, ప్రజా సంఘాలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం సీపీఐ నాయకులు కె.నాగిరెడ్డి,డి.ఓబులయ్య,పులిరాజు,అన్వర్‌బాషా తదితరులు సబ్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. కాగా.. విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న ఇబ్బందులను గుర్తించి ట్రాన్స్‌కో అధికారులు టెక్నికల్ సిబ్బందితో ఫీడర్లలో ఉన్న లోపాలను తాత్కాలికంగా పరిష్కరించారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి తీవ్రగాయాలు



గాయపడిన రాఘవేంద్ర, పవన్‌కుమార్

జూపాడుబంగ్లా: మండలం సమీపంలోని ఆశ్రయ ట్రస్టు సమీపంలో కేజీ రోడ్డుపై బైక్ అదుపుతప్పి కిందపడటంతో ఇద్దరు యువకులు గాయపడిన సంఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. జూపాడుబంగ్లాకు చెందిన రాఘవేంద్ర, సంకిరేణిపల్లెకు చెందిన పవన్‌కుమార్ బైక్‌పై నందికొట్కూరు నుంచి జూపాడుబంగ్లాకు బయలుదేరారు. మార్గం మధ్యలో ఆశ్రయ ట్రస్టు వద్దకు రాగానే అదుపుతప్పి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలు కాగా వారిని ఆటోలో నందికొట్కూరు ఆసుపత్రికి తరలించారు.

- మూడు బీర్లు.. ఆరు క్వార్టర్లుగా వ్యాపారం
- మద్యం దుకాణాల్లో లభించని బ్రాండ్లు సైతం బెల్టుషాపుల్లో లభ్యం
- క్వార్టర్‌పై రూ.50 నుంచి రూ.100 అధికంగా విక్రయం
- మండలవ్యాప్తంగా 40 దాకా బెల్టు దుకాణాలు
- నూతన బెల్టు దుకాణాల కోసం వైన్‌షాపు చుట్టూ ఆశావహుల ప్రదక్షిణలు

గ్రామాల్లో బెల్టు దందా

జూపాడుబంగ్లా: మద్యం దుకాణాల్లో లభించని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకకు చెందిన పలురకాల బ్రాండ్ల మద్యం గ్రామాల్లోని బెల్టు దుకాణాల్లో లభిస్తోందంటే బెల్టుదుకాణాల జోరు ఏపాటిగా కొనసాగుతుందో అర్థం చేసుకోవచ్చు. వారం క్రితం వరకు ప్రభుత్వం మద్యం దుకాణాలను నిర్వహించడంతో పాటు బెల్టు దుకాణాల నిర్వహణను అరికడుతూ వచ్చింది. ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ కలిపి సెబ్ పేరిట ఉండటంతో పాటు సిబ్బంది తక్కువగా ఉన్నారనే సాకుతో దాడులు నామమాత్రంగా నిర్వహిస్తూ వచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ మద్యం దుకాణాలకు మంగళం పాడి ప్రైవేటు మద్యం దుకాణాల నిర్వహణకు తెరతీసింది. దీంతో బెల్టు దుకాణాల నిర్వాహకులకు రెక్కలొచ్చినట్లయింది. మండలంలోని తూడిచెర్ల గ్రామాన్ని అడ్డాగా చేసుకొని ఓ వ్యక్తి తెలంగాణ, కర్ణాటక ప్రాంతాల నుంచి మద్యం తెప్పించి చుట్టుపక్కల గ్రామాలైన కనకయ్యకొట్టాల, వాడాల, మిట్టకందాల, పారుమంచాల తదితర గ్రామాలకు మద్యం సీసాలను సరఫరా చేస్తున్నట్లు సమాచారం. గతంలో ఇతన్ని పోలీసులు అరెస్టు చేసినా యథావిధిగా బెల్టు దుకాణం నిర్వహించి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారు.

జేబులకు చిల్లు: మండల కేంద్రంలోని మద్యం దుకాణం వద్దకు వచ్చి మద్యం కొనుగోలు చేయలేని వారు గ్రామాల్లోని బెల్టు దుకాణాల్లో విక్రయించే మద్యంపై ఆధారపడ్తున్నారు. దీనికితోడు మద్యం దుకాణంలో కంటే బెల్టు దుకాణంలో నాణ్యమైన బ్రాండ్ల మద్యం లభిస్తుండటంతో మద్యం ప్రియులు అధికంగా బెల్టు దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుంటున్న బెల్టుషాపుల వారు క్వార్టర్ సీసాపై రూ.50 నుంచి రూ.100 అధిక ధరతో విక్రయిస్తున్నారు. మద్యం ధర పెంచి విక్రయిస్తున్నా చేసేది లేక తప్పనిసరి పరిస్థితుల్లో బెల్టు దుకాణాల్లో మద్యం కొనుగోలు చేసి తాగుతూ జేబులు ఖాళీ చేసుకుంటున్నారు.



తంగడంచలో బెల్టు దుకాణంలో మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

నామమాత్రంగా దాడులు: గ్రామాల్లో బెల్టు దుకాణాలు నిర్వహించి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సివిల్, ఎక్సైజ్ శాఖ పోలీసులకు తెలిసినా వారు నామమాత్రంగా దాడులు నిర్వహిస్తూ మమ అనిపిస్తున్నారనే విమర్శలున్నాయి. గతంలో తెలంగాణ రాష్ట్రం నుంచి మద్యం సీసాలను తీసుకొచ్చే వారిపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేసేవారు. ప్రస్తుతం చెక్‌పోస్టులు ఎత్తివేయడంతో యథేచ్ఛగా తెలంగాణ నుంచి అక్రమంగా మద్యం తెచ్చి బెల్టు దుకాణాల్లో విక్రయిస్తున్నారు.

అన్నా.. బెల్టుషాపు మాకే ఇవ్వాలి

కొంత మంది గ్రామాల్లో బెల్టు దుకాణం నిర్వహించుకొనేందుకు తమకే అవకాశం కల్పించాలంటూ మద్యం దుకాణందారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గ్రామాల్లో బెల్టు దుకాణానికి అనుమతివ్వాలంటే రూ.50 వేల డిపాజిట్ చెల్లిస్తేనే మద్యం బాటిళ్లు ఇస్తామని పేర్కొంటున్నట్లు బెల్టుదుకాణాల నిర్వాహకులు చర్చించుకుంటున్నారు. మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో ఒక్కో గ్రామంలో రెండు, మూడు చొప్పున మండలంవ్యాప్తంగా సుమారు 40దాకా బెల్టు దుకాణాలున్నాయి. ఇదివరకు గ్రామాల్లో బెల్టు దుకాణాలు నిర్వహించుకొనే వారు ప్రస్తుతం తమకే బెల్టు దుకాణాల నిర్వహణకు అనుమతివ్వాలంటూ మద్యం దుకాణదారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు సమాచారం. గ్రామాల్లో బెల్టుదుకాణాలు నిర్వహించకుండా సివిల్, ఎక్సైజ్ శాఖల పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని, గ్రామాలు ప్రశాంతంగా ఉండేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

బెల్టు దుకాణాలు నిర్వహిస్తే ఉపేక్షించం



గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు తెలిస్తే ఉపేక్షించేది లేదు. బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్నట్లు మా దృష్టికి వస్తే దాడులు నిర్వహించి నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే గ్రామాల్లో నిఘా ఉంచి దాడులు నిర్వహిస్తున్నాం.క్రమేణా అన్ని గ్రామాల్లో దాడులు నిర్వహించి బెల్టు దుకాణాలు లేకుండా చేస్తాం. – **రామాంజనేయులు, ఎక్సైజ్ సీఐ, నందికొట్కూరు**

భూ సమస్యలపై అర్జీల స్వీకరణ

పాములపాడు: మండలంలోని భానుముక్కల గ్రామంలో మంగళవారం జరిగిన గ్రామసభలో రైతులు తహసీల్దార్ సుభద్రమ్మకు భూ సమస్యలపై 150 అర్జీలు ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. తమ భూముల విస్తీర్ణంలో తేడాలున్నాయని, దీంతో ఇటీవల వర్షాల వల్ల నష్టపోయిన పంటలకు పరిహారం అందలేదని వాపోయారు. మరికొందరు రైతులు తమ భూములు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని వివరిస్తూ అర్జీలు సమర్పించారు. తహసీల్దార్ స్పందిస్తూ.. రైతులు సమర్పించిన అర్జీలను జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పంపి ఉన్నతాధికారుల సూచనల మేరకు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. మండల సర్వేయర్ భాస్కర్, రీసర్వే డీటీ సుప్రియ, వీఆర్వో పురంధరుడు, పాల్గొన్నారు.



భానుముక్కలలో తహసీల్దార్ సుభద్రమ్మకు సమస్యలు చెప్పుకుంటున్న రైతులు

మిడుతూరు: మండలంలోని అలగనూరులో సర్వే డిప్యూటీ తహసీల్దార్ సునీల్‌రాజ ఆధ్వర్యంలో రెవెన్యూ సమస్యలపై గ్రామసభ నిర్వహించారు. గ్రామస్తుల నుంచి భూ సమస్యలపై వినతులు స్వీకరించారు. ప్రభుత్వ భూములు ఆన్‌లైన్‌లో ఒకరి పేరు ఉండగా అనుభవంలో మరొకరు ఉండడం, మిగులు భూములను ఆన్‌లైన్‌లో నమోదు, పేర్ల మార్పు, తదితర వాటిపై రైతులు అర్జీలు అందజేశారు. సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఉమాపతి, మండల సర్వేయర్ కృష్ణుడు, ఆర్ఐ జహంగీర్, వీఆర్వో రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు 49–బన్నూరులో గ్రామసభ

మండలపరిధిలోని 49–బన్నూరులో బుధవారం ఉదయం 10:30 గంటలకు గ్రామసభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. గ్రామస్తులు భూ సమస్యలపై అర్జీలు సమర్పిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పగిడ్యాల: మండలంలోని పాత ముచ్చుమర్రి గ్రామంలో సర్పంచ్ పెద్ద ఆంజనేయులు అధ్యక్షతన సర్వే డిప్యూటీ తహసీల్దార్ మురళీ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. పొలం విస్తీర్ణంలో తేడాలు, జాయింట్ ఎల్‌పీసీ సమస్యలు, పేర్ల తారుమారు తదితర సమస్యలపై అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పోతులపాడులో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్

కొత్తపల్లి: మండలకేంద్రంలో నిర్వహించిన గ్రామసభలో 50 మంది రైతులు భూసమస్యలపై అర్జీలు ఇచ్చినట్లు తహసీల్దార్ ఉమారాణి తెలిపారు. అర్జీలను పరిశీలించి సమస్యలను త్వరలో పరిష్కరిస్తామన్నారు. డీటీ పెద్దన్న, జెడ్పీటీసీ సోమల సుధాకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: మండలంలోని పోతులపాడు గ్రామంలో సర్పంచ్ పల్లెనిర్మలమ్మ అధ్యక్షతన తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు వారి పొలం సర్వే నంబర్, విస్తీర్ణం, పేర్లు తప్పొప్పులను సరిచేసేందుకు అర్జీలు సమర్పించారు. డీటీ నాగన్న, సర్వేయర్ షాద్‌మాన్ అతీఫ్, వీఆర్వో సాయిబాబా, రైతులు పాల్గొన్నారు.

కొమరం భీమ్‌కు నివాళి

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని బండ చెంచుగూడెంలో మంగళవారం ఆదివాసి గిరిజన నాయకుడు కొమరం భీమ్ 123వ జయంతి సందర్భంగా చెంచులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కొమరం భీమ్ ఆదివాసి గిరిజన సంఘం గౌరవాధ్యక్షుడు ఆశీర్వాదం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పుట్టిన కొమరం భీమ్ గోండు, ఆదివాసి గిరిజనుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేశారని కొనియాడారు. ఆదివాసి గిరిజనులకు అందాల్సిన పథకాలు, హక్కులు పొందడానికి పోరాటం చేసి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టీయూ మండల కార్యదర్శి మల్లికార్జున, సంఘం నాయకురాలు భ్రమరాంబ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక’

పగిడ్యాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ శివరాముడు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక మొక్కుబడిగా సాగింది. ఉదయం 10 గంటలకు హాజరుకావాల్సిన ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఆలస్యంగా 11.45 గంటలకు హాజరయ్యారు. కేవలం గంటపాటు కొనసాగిన కార్యక్రమంలో ప్రజల నుంచి ఎమ్మెల్యే 34 దరఖాస్తులు స్వీకరించారు. ఎక్కువగా భూ సమస్యలు, పొలం రస్తా వివాదాలకు సంబంధించిన అర్జీలు వచ్చాయి. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేసి సంబంధిత అధికారికి పంపి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎంపీడీఓ సుమిత్రమ్మ, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, ఎంఈఓ సుభాన్, మండల ఆర్ఐ శ్రీరంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ దాణాను సద్వినియోగం చేసుకోండి

పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై ప్రభుత్వం సరఫరా చేసే దాణాను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సంపూర్ణ మిశ్రమ దాణా(టీఎంఆర్) పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. జూపాడుబంగ్లా డివిజన్ పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు రామాంజనేయ నాయక్ పాల్గొన్నారు. జీవాల్లో నట్టల నివారణకు డీ వార్మింగ్ కార్యక్రమం ఈ నెల చివరి వరకు కొనసాగుతుందని చెప్పారు. పశువైద్యులు శ్రుతికీర్తి, రాగసంధ్య, సిబ్బంది పాల్గొన్నారు.



భూ రీసర్వే పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

భూసమస్యల పరిష్కారానికి కృషి

నందికొట్కూరు: భూ రీసర్వేతో సమస్యలు పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే జయసూర్య సూచించారు. మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో మంగళవారం రీసర్వే ప్రాజెక్టులో భాగంగా భూ సమస్యల పరిష్కార కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఏవైనా భూ సమస్యలుంటే గ్రామసభల్లో అధికారులను సంప్రదించి పరిష్కరించుకోవాలన్నారు. తహసీల్దార్ శ్రీనివాసులు, సర్పంచు నాగలక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు



మాట్లాడుతున్న తహసీల్దార్ రత్నరాధిక

ఆత్మకూరురూరల్: రీసర్వే గ్రామాల్లో రైతులకు ఏవైనా సమస్యలుంటే పరిష్కరించేందుకే గ్రామసభలు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ జి.రత్న రాధిక పేర్కొన్నారు. మండలంలోని కరివేన గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. పలువురు రైతులు జాయింట్ ఎల్‌పీఎంల సబ్ డివిజన్, విస్తీర్ణ మార్పు, పట్టాదారు పేరు మార్పు వంటి అంశాలపై మొత్తం 35 అర్జీలను అందజేశారు. ఎంపీపీ నల్లకాల్వ తిరుపాలమ్మ, డిప్యూటీ తహసీల్దార్, రీసర్వే, మండల సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

వెలుగోడు: మండలంలోని బోయ రేవుల గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి 142 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఇదివరకే బోయ రేవుల గ్రామంలో రీ సర్వే జరిగిందని, భూములు కొలతల్లో తేడాలున్నాయని 74 దరఖాస్తులు వచ్చాయన్నారు. 68 మంది పట్టాదారు పాసు పుస్తకాలు లేవని, ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. వీటన్నింటిని నవంబర్ 30వ తేదీలోపు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. డీఐఓ రవీంద్ర పాల్, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, మండల సర్వేయర్ ఉపేంద్ర, సీనియర్ అసిస్టెంట్ వెంకటరామిరెడ్డి, వీఆర్వోలు మహబూబ్ బాషా, జేబీవుల్లా, రైతులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

జూపాడుబంగ్లా: రైతులు పంటలసాగులో రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకం తగ్గించుకోవాలని ఏఓ కృష్ణారెడ్డి సూచించారు. మంగళవారం పారుమంచాల గ్రామంలో ×పొలం పిలుస్తోంది¥ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ సాగుచేసిన పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పంట నమోదుతో పాటు ఈ–కేవైసీ చేయించుకొంటేనే పండించిన ధాన్యం మద్దతు ధరకు విక్రయించుకోవడం, పంట నష్టపరిహారం వర్తింపుతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. అనంతరం రైతులకు పొగాకు సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. రైతులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



సస్యరక్షణ చర్యలను వివరిస్తున్న ఏఓ కృష్ణారెడ్డి

దరఖాస్తు గడువు పొడిగింపు

నందికొట్కూరు: ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆయా పోస్టులకు దరఖాస్తు గడువు ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు సీడీపీఓ కోటేశ్వరమ్మ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 21వ తేదీ వరకు దరఖాస్తు గడువు ఉండేదన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని చెప్పారు. అర్హులైన వారు ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు నిధుల మంజూరు

జూపాడుబంగ్లా: అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయ్‌లెట్లు, తాగునీటి కుళాయిల ఏర్పాటు కోసం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ నుంచి రూ.33.65 లక్షల నిధులు మంజూరైనట్లు తాగునీటి శాఖ ఏఈ నాగేంద్రబాబు తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ..నందికొట్కూరు నియోజకవర్గవ్యాప్తంగా ఆరు మండలాల్లో 42 అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయ్‌లెట్ల నిర్మాణానికి రూ.15.12 లక్షలు, తాగునీటి సౌకర్యం కోసం 109 అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.18.53 లక్షల నిధులు మంజూరైనట్లు చెప్పారు. జూపాడుబంగ్లా మండలంలో 10 అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయ్‌లెట్ల నిర్మాణానికి ఒక్కోదానికి రూ.36 వేల చొప్పున రూ.3.60 లక్షలు, తాగునీటి కుళాయిల కోసం ఒక్కో కేంద్రానికి రూ.17 వేల చొప్పున 18 అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.3,06, లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. వీటితో పాటు 9 కేంద్రాలకు మైనర్ మరమ్మతుల కోసం రూ.3 వేల చొప్పున రూ.27 వేల నిధులు మంజూరైనట్లు చెప్పారు. ఈ నిధులతో వంద రోజుల్లో పనులు పూర్తిచేయనున్నట్లు ఏఈ నాగేంద్రబాబు వెల్లడించారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

నందికొట్కూరు: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సీఐలు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సుబ్రమణ్యం సూచించారు. మంగళవారం పట్టణ సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి పటేల్ సెంటర్ వరకు సీబీఎస్ సేవాసమితి, నందికొట్కూరు అర్బన్, రూరల్ పోలీస్ వారి ఆధ్వర్యంలో త్రీకే రన్ నిర్వహించారు. మాదక ద్రవ్యాలను నిర్మూలిద్దామంటూ పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత మాదకద్రవ్యాల నుంచి దూరంగా ఉండాలన్నారు. వ్యసనాలకు బానిసలు కాకుండా రాష్ట్ర, దేశాభివృద్ధికి పాటు పడాలని సూచించారు. ఎస్ఐలు, కూటమి నాయకులు రామిరెడ్డి, ఏసేపు, రాజు, డాక్టర్ వనజ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

ఆత్మకూరు: కొత్తపల్లి మండల కేంద్రంలోని చెంచుగూడెంలో నివాసముంటున్న విభిన్న ప్రతిభావంతురాలైన చెంచుగిరిజన మహిళ కొత్తపాటి బయమ్మకు గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జవహర్‌నాయక్ మంగళవారం నిత్యావసర సరుకులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. తినడానికి తిండి లేక, ఉండడానికి ఇల్లు లేక రెండు కాళ్లు లేక అంగవైకల్యం ఉన్నా పింఛన్ రాక ఆమె తీవ్ర ఇబ్బందులు పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.అలాగే బయమ్మ భర్త పక్షవాతంతో బాధపడుతున్నాడని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

పకడ్బందీగా సర్వే చేపట్టండి

మిడుతూరు: మండలంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ పథకం సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ దశరథరామయ్య సూచించారు. ఆయన మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వెలుగు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ పథకం కింద వయోజన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం సర్వే నిర్వహిస్తుందని చెప్పారు. మండలంలో 850 మంది నిరక్షరాస్యులను గుర్తించినట్లు తెలిపారు. 10 మందికి ఒక వలంటీర్ చొప్పున ఏర్పాటు చేశామని, వీరంతా స్వచ్ఛందంగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. వెలుగు ఏపీఎం సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

25 మందికి ఉద్యోగావకాశాలు

ఆత్మకూరు: జాబ్‌మేళా ద్వారా 25 మంది నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వై.జిష్ణునాగవిజయ్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. టాటా టెలీ కమ్యూనికేషన్, బిగ్ బాస్కెట్, శ్రీరామ్ చిట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, సన్ కిషన్ అగ్రి అండ్ కో కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. మొత్తం 65 మంది నిరుద్యోగులు హాజరుకాగా.. 25 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ చెప్పారు.



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న కంపెనీల ప్రతినిధులు

వరి పొలంలో ఎలుకలను నివారించాలి



శివపురంలో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

కొత్తపల్లి: ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన వరి పంటలో ఎలుకల నివారణకు చర్యలు చేపట్టాలని ఏఓ మహేష్ సూచించారు. ఆయన మంగళవారం మండల పరిధిలోని ముసలిమడుగు, శివపురం గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ.. వరిపైరు కంకిదశలో ఉన్నందున ఎలుకల బెడద అధికంగా ఉంటుందన్నారు. వాటిని నియంత్రించి మెరుగైన దిగుబడి సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎలుకల బొరియల వద్ద 15 గ్రాముల ఎలుకల మందు (2 శాతం వంటనూనె, 2 శాతం బ్రోమడాయేలిన్, 96 శాతం నూకలు) ఉంచాలన్నారు. అలాగే అకాల వర్షాల వల్ల పైరు నేలకొరిగితే పొలంలో నీటిని తొలగించి వరిపైరును కట్టలుగా కట్టుకోవాలని సూచించారు. పొలాల్లో నీరు తగ్గిన వెంటనే కిందపడిన వరిధాన్యం మొలకెత్తకుండా ఉప్పునీటిని పిచికారీ చేసుకోవాలన్నారు. ఉపసర్పంచ్ నాగన్న, రైతులు పాల్గొన్నారు.

బైక్ దొంగ అరెస్టు

నందికొట్కూరు: పట్టణంలో గత నెల 25వ తేదీన బైక్ చోరీ జరిగినట్లు బాధితుడు కుర్వపేట మద్దిలేటి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కోటవీధిలో బాడుగ ఇంట్లో నివాసం ఉంటున్న ఆత్మకూరు పట్టణానికి చెందిన ఖాదర్‌బాషాను అనుమానంతో అదుపులోకి తీసుకొని విచారించడంతో బైక్ దొంగతనాలను ఒప్పుకున్నట్లు చెప్పారు. అతని నుంచి రెండు బైక్‌లను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు టౌన్ సీఐ చెప్పారు.



దొంగ అరెస్టును చూపుతున్న టౌన్ సీఐ, ఎస్ఐ చంద్రశేఖర్, పోలీసులు

జూడోలో సత్తాచాటిన క్రీడాకారులు

నందికొట్కూరు: పట్టణంలోని నవనంది హైస్కూల్ క్రీడాకారులు రాష్ట్రస్థాయి జూడోలో బంగారు పతకాలు సాధించినట్లు పాఠశాల చైర్మన్ శ్రీధర్ తెలిపారు. రాష్ట్రస్థాయి జూడోలో హిమతేజ, పురందర్ బంగారు పతకం, ఛార్లెస్ రజత పతకం సాధించడంతో మంగళవారం పాఠశాల చైర్మన్, హెచ్‌ఎం నరసప్ప, కో ఆర్డినేటర్ మౌలాలి అభినందించారు. వారు మాట్లాడుతూ తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో ఈ నెల 19, 20, 21 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటడం అభినందనీయమన్నారు.

నీళ్లలోనే పైర్లు

పాములపాడు: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పొలాల్లో నిలిచిన నీరు పైర్లను వదలడం లేదు. దీంతో మొక్కజొన్న పైర్లు వర్షపు నీటిలోనే మగ్గుతున్నాయి. కోత మిషన్లు పొలాల్లోకి దిగేదెన్నడు, ధాన్యం ఇంటికి తెచ్చుకునేదెన్నడు, అమ్ముకునేదెన్నడు, రబీకి పొలాలు సిద్ధం చేసుకునేదెన్నడో అని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. నీరు పూర్తిగా పొలాల్లోంచి బయటకు వెళ్లే పరిస్థితులు కానరావడం లేదు. పూర్తిగా పొలంలోనే ఇంకి పోవాల్సిన పరిస్థితి నెలకొంది. పొలాలు పూర్తిగా తడి ఆరితేనే కోత మిషన్లతో పంట కోతకు అనుకూలంగా ఉంటుంది. లేకపోతే మిషన్లు పొలంలో ఇరుక్కుపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. దీంతో మిషన్ల యజమానులు సైతం పొలాల్లో కోతకు వెళ్లేందుకు సాహసించడం లేదు. మండలంలో ఇప్పటికీ కేవలం 40 శాతం మాత్రమే మొక్కజొన్న పైరు కోతలు పూర్తయ్యాయి. సోయాబీన్ నీటిలోనే నాశనం అయ్యింది. వర్షాలు తగ్గి నేల ఆరితే కోతలు చేపట్టవచ్చని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఏదేమైనా ఈ సంవత్సరం రైతన్నలకు ఖరీఫ్ కన్నీటిని మిగిల్చింది.



వర్షపు నీరు అధికమవ్వడంతో వాడిపోయిన మొక్కజొన్న పైరు



పొలంలో నిలిచిన వర్షపు నీరు

దెబ్బతిన్న పంటల పరిశీలన

బండి ఆత్మకూరు: మండలంలో సోమవారం కురిసిన భారీ వర్షాలకు మండలంలోని ఈర్నపాడు, కడుమల కాలువ, వెంగళరెడ్డి పేట, బి.కోడూరు గ్రామాల్లో భారీగా వరి పంట నేలకొరగడంతో ఆయా గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి ఎం.స్వాతి మంగళవారం పర్యటించారు. పొలాల్లోకి వెళ్లి నష్టపోయిన రైతులను అడిగి వివరాలు తెలుసుకుని ఫొటోలతో సహా నమోదు చేసుకున్నారు. ఆమె మాట్లాడుతూ ఈ క్రాప్ చేయించుకున్నందు వల్ల బీమా వర్తిస్తుందని, ఆందోళన చెందవద్దు అని రైతులకు భరోసానిచ్చారు.



నేలకొరిగిన వరిపైరును పరిశీలిస్తున్న ఏఓ ఎం.స్వాతి

తెలంగాణ మద్యం స్వాధీనం

నందికొట్కూరు: తెలంగాణ మద్యం తెచ్చేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం ఖాయమని ఎక్సైజ్ శాఖ ఎస్ఐ జఫ్రుల్లా హెచ్చరించారు. మంగళవారం జూపాడుబంగ్లా మండల పరిధిలోని తంగడంచ గ్రామానికి చెందిన పిక్కిలి లక్ష్మీదేవి వద్ద తెలంగాణ రాష్ట్రానికి చెందిన 12 మద్యం బాటిళ్లు సీజ్ చేసి ఎక్సైజ్ శాఖ ఎస్ఐ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ మద్యం అక్రమంగా తీసుకొచ్చినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుళ్లు శంకర్‌నాయక్, కుమారి, పోలీసులు సుధీర్, శ్వేతరాణి, రమిజాబీ తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న లక్ష్మణగౌడును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ సురేష్‌బాబు తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ.. గ్రామస్తుల నుంచి అందిన సమాచారం మేరకు నిందితుడి ఇంట్లో సోదాలు చేయగా 18 మద్యం క్వార్టర్ బాటిళ్లు లభించినట్లు చెప్పారు. మద్యం స్వాధీనం చేసుకొని, నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

కొత్తపల్లి: గ్రామ శివారులోని రైసుమిల్లు వద్ద అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ కేశవ మంగళవారం వెల్లడించారు. వివరాలు.. ఎదురుపాడు గ్రామానికి చెందిన పూసలపాటి రవి అనే వ్యక్తి కొత్తపల్లి నుంచి బైక్‌పై అక్రమంగా మద్యం తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి 15 క్వార్టర్ల మద్యం సీసాలు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.